బస్ షెల్టర్ ప్రారంభమెప్పుడో?

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్

చిట్యాల: ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి 2016లో రూ.24.8లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. నిర్మాణం పూర్తి అయి సంవత్సరాలు దాటినా ప్రారంభించిక పోవడంతో బస్సులు చౌరస్తా నుంచే వెళ్లుతున్నాయి. దీంతో చౌరస్తాలో ప్రయాణికులకు నిల్చునే నీడ లేక దుకాణాల ముందు గంటల తరబడి నిల్చుంటూ అనేక అవస్థలు పడుతున్నారు. ప్రజలకు ముఖ్యంగా వర్షాకాలం, ఎండాకాలంలో తిప్పలు తప్పడం లేదు. వర్షం కురిసినప్పుడు ఎక్కడ ఉండాలో తెలియక తడుస్తూ దుకాణాల ముందు ఏర్పాటు చేసిన రేకుల ముందు నిల్చుంటూ తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక వృద్ధుల పరిస్థితి మరీ దారుణం. మొగుళ్లపల్లి, నవాబుపేటకు వెళ్లే ప్రయాణికులు ఆటోలో వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్ వద్ద ఆటో పాయింట్ ఉండడంతో వారు కొంత దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అదే నూతన బస్‌షెల్టర్ ప్రారంభమైతే బస్సులు అక్కడి వరకు వెళ్లడంతో ఆయా గ్రామాల ప్రయాణికులకు ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు.

అధ్వానంగా నూతన బస్‌షెల్టర్..

ప్రయాణికుల సౌకర్యార్థం కోసం నిర్మించి సంవత్సరాలు గడిచిన బస్‌షెల్టర్‌ను ప్రారంభానికి నోచుకపోవడం అధ్వానంగా తయారైంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మిస్తే కనీసం దానిని ప్రారంభించకపోవడం ఎంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి బస్‌షెల్టర్‌ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నియామకం



వాజేడు: మండల పరిధిలోని పేరూరులో వచ్చిన వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్ సమక్షంలో మండల యూత్ అధ్యక్షుడిగా గౌరారపు సర్వేశ్వరరావును నియమించారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావుకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గురి రమణయ్య, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

మహాసభలకు తరలిన నాయకులు

భూపాలపల్లి అర్బన్: నల్గొండ జిల్లాలో నిర్వహిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర ఆరోవ మహాసభలకు జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కుమారస్వామి తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మహాసభలకు జిల్లా నుంచి 15 మంది కార్యకర్తలు, ఐదుగురు ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు.

కొండగట్టుకు బయల్దేరిన హనుమాన్ మాలధారులు



వాజేడు: హనుమాన్ దీక్షలను చేపట్టిన భక్తులు ఇరుముడులు తీసుకుని మాల విరమణ కోసం ఆదివారం కొండగట్టు బయల్దేరారు. మండల పరిధిలోని పూసూరు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద వాజేడు, పూసూరు గ్రామాల నుంచి హనుమాల్ దీక్షలను చేపట్టిన స్వాములు నియమ నిష్టలతో 41 రోజుల పాటు దీక్షలను చేశారు. గురు స్వామి సౌమిత్రి వేణు గోపాలచార్యులు ఇరుముడులకు అనుమతిని ఇవ్వడంతో మాల విరమణ కోసం వారంత కొండ గట్టుకు తరలివెళ్లారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండంలోని నైన్‌పాక శివారులో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా మానేరు వాగు నుంచి భూపాలపల్లి వైపు అక్రమంగా ఇసుక ట్రాక్టర్లు తరలిస్తుండగా పట్టుకుని డ్రైవర్లు నూనెటి ఓదేలు(నాచారం), కంచెం శివ(అనుసంపల్లి) లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇద్దరిపై కేసు

రేగొండ: మండలంలోని పొనగండ్ల గ్రామానికి చెందిన మహమ్మద్ సర్వర్‌బీని అదే గ్రామానికి చెందిన ఆమె సోదరులు మహమ్మద్ అంకుష్, మహమ్మద్ షబ్బీర్ శనివారం రాత్రి పాత కక్షల నేపథ్యంలో దాడి చేశారు. దీంతో ఆదివారం బాధితురాలు ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

దూద్‌పల్లిలో చోరీ

చిట్యాల: మండలంలోని దూద్‌పల్లి గ్రామానికి చెందిన ముక్కెర సారయ్య-యశోద దంపతుల ఇంట్లో ఆదివారం రూ.90 వేలతో పాటు 20 తులాల వెండి అపహరణకు గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యశోద ఉదయం కూలి పనికి వెళ్లింది. భర్త సారయ్య బయటకు వెళ్లాడు. సాయంత్రం సారయ్య ఇంటికి రాగా తాళం పగలకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి బీరువా చూడగా బీరువాలో నగదు, వెండిని దొంగలు అపరించినట్లు బాధితుడు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న బాలిక మృతి



వెంకటాపురం(కె): పుగురుల మందు తాగి చికిత్స పొందుతూ బాలిక మృతి చెందిన సంఘటన బెస్తగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బెస్తగూడెం గ్రామానికి చెందిన కంపెల్లి సంజన(13) ఈ నెల 7న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు చికిత్స నిర్వహిస్తుండగా ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. కాగా, బాలిక గత కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఉంటుందని, అదే క్రమంలో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిందని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 1987–88 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. చాలా సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, ఆనందాలను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే మృతి చెందిన తోటి విద్యార్థుల ఆత్మ శాంతించాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులతో పాటు, పూర్వ విద్యార్థులు బొజ్జపెల్లి రాజన్న, ఎస్‌ఆర్ మల్లన్న, నేరేళ్ల తిరుపతి, మొగిళి, రవీంద్రచారి, వెంకటస్వామి, డాక్టర్ రఘునందన్, రాజేశం, రాజేందర్, రవీందర్, రాంరెడ్డి, యాకూబ్, సత్యనారాయణ, సుమీల దేవి, రమాదేవి, శారధ, పద్మ, కరుణ, విజయ నిర్మల, లక్ష్మీ, వనమాల, రమాదేవి, కౌసల్య, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రవిగౌడ్

ములుగు రూరల్: ఏజెన్సీ కల్లుగీతా కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కల్లు గీతా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. ఆదివారం సర్వాపూర్ గీతా కార్మికులతో కలిసి మాట్లాడారు. ఏజెన్సీలలో 24 సంవత్సరాల క్రితం రద్దు చేసిన గీతా సొసైటీలను పునరుద్ధరించాలని అన్నారు. గీతా కార్మికులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీతా కార్మికుడికి పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏజెన్సీ కల్లు గీతా కార్మికులతో కలిసి పాదయాత్రలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గీతా కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ సిద్ధాంతాన్ని అలవర్చుకోవాలి

- పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్


నియామక పత్రం అందజేస్తున్న వెంకటేశ్

చిట్యాల: బీజేపీ సిద్ధాంతాన్ని ప్రతీ కార్యకర్త అలవర్చుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. దేశంలోనే సిద్ధాంతం కలిగిన ఎకైక పార్టీ బీజేపీ అన్నారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి తీసుకవచ్చిన ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధ పథంలో నిలుస్తున్నాడని పేర్కొన్నారు. అనంతరం 164, 165,166,167, 86 బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సమ్మేళనానికి హాజరు కావాలి



సన్నాహక సమావేశంలో పూర్వ విద్యార్థులు

ఏటూరునాగారం: మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 60 సంవత్సరాల నుంచి పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం గోల్డెన్ జూబ్లికోసం సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్డెన్ జూబ్లి సమావేశ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న మాట్లాడుతూ.. 60 సంవత్సరాల నుంచి ఇప్పటివరకు పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులను కలుసుకోవడం కోసం ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామం, ఇతర ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరు కావాలని, త్వరలోనే తేదీలను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చందు, మాజీ ఎంపీటీసీ సదాశివుడు, నూక ప్రభాకర్, గోరంటల సత్యం, హుస్సేన్, సుంచు నాగరాజు, మడుగూరి నాగేశ్వర్‌రావు, తుమ్మ మల్లారెడ్డి, చెన్న రాంబాబు, అలువాల శ్రీనివాస్, హబీబ్, నూతి కృష్ణ, లింగాల మురళి, గొట్టిముక్కల నాగసాగర్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పులతో హైదరాబాద్ దద్దరిల్లాలి

పరకాల: వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న లక్ష డప్పులతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో భూమి ఆకాశం దద్దరిల్లేలా దండోరా వేయాలని కళాకారుల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బరిగెల బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ పిలుపునిచ్చారు. పరకాల అమరధామంలో ఆదివారం జరిగిన డప్పు కళాకారులు, కళామండలి, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా బాబు, శంకర్ మాదిగ హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన డప్పు కళాకారుల హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం మాదిగ డప్పు కళాకారుల జిల్లా కన్వీనర్‌గా కోకిల రవి, కో కన్వీనర్‌గా కొయ్యడ విష్ణులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈర్ల చిన్ని, మాదిగ కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామంచ రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుముల కృష్ణ, దుప్పటి మొగిళి, ఈర్ల రమేశ్, చెరుకు వేణు, దుప్పటి ప్రవీణ్, పసుల సదానందం పాల్గొన్నారు.

కూల్చివేతలు.. బాధితుల వెతలు!


చెరుకూరులో దుకాణాలు కూల్చిన తర్వాత మళ్లీ నిర్మించుకుంటున్న చిరు వ్యాపారులు



రహదారి చదును చేస్తున్న ప్రొక్లెయినర్

- గూడు కోల్పోతున్న గ్రామాల ప్రజలు
- పరిహారం ప్రస్తావనే కరువు..
- అధికారులు పట్టించుకోవాలని విన్నపం


చెరుకూరులో తొలగించిన ఇల్లు

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం నుంచి చెరుకూరు వరకు 10 కిలో మీటర్ల జాతీయ రహదారి(డబుల్ రోడ్డును)ని ఫోర్ వే లైన్‌గా విస్తరిస్తున్నారు. ఈ రహదారి విస్తరణలో భాగంగా ఇప్పటికే రహదారికి ఇరువైపులా పనులను చేపట్టారు. చెట్లు, పొదలు తొలగించడంతో పాటు గ్రామాలు ఉన్న చోట్ల దుకాణాలు, ఇళ్లను తొలగిస్తున్నారు. దీంతో చాలా మంది ఇళ్లు సగానికి పైగ పోతుడంటంతో వారు గూడును కోల్పోతున్నారు. జగన్నాథపురం, గుమ్మడి దొడ్డి, చెరుకూరు గ్రామాల్లో ఎక్కువగా దుకాణాలు తొలగించబడ్డాయి. ముఖ్యంగా చిరు వ్యాపారాలు, పేదల గూడు పోతుండటంతో వారి బాధ వర్ణనాతీతం. దీంతో ఇళ్లు కోల్పోయిన బాధితులు తమకు నష్ట పరిహారం కావాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేస్తున్నారు. నష్టం జరిగిన బాధితులకు పరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తుందా? రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందా? అసలు ఇస్తారా? లేదా? అనే అనుమానాలు బాధిత కుటుంబాల్లో నెలకొన్నాయి.

గ్రామాల్లో 100, గ్రామం లేని చోట 40 అడుగుల తొలగింపు

రహదారి పొడవున గ్రామాలు ఉన్న చోట 100 అడుగులు(27 మీటర్లు), గ్రామాలు లేని చోట 40 అడుగులు(12 మీటర్లు) మేర రోడ్డును చదును చదును చేస్తున్నారు. గ్రామాల్లో రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలు చేయాల్సి ఉంటుంది కావున 100 అడుగుల మేర రహదారిని చదును చేస్తున్నారు. జాతీయ రహదారి నియమ నిబంధనల ప్రకారం రహదారి విస్తరణ కోసం స్థలాన్ని చదునుచేస్తున్నారు.



హనుమంతుడి గుడి సైతం

మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలోని హనుమంతుడి గుడి సైతం రహదారి విస్తరణలో పోతుంది. ప్రస్తుతానికి గుడిని తొలగించనప్పటికి త్వరలోనే ఈ గుడిని తొలగించే అవకాశం ఉంది. ఇప్పటికే గ్రామస్తులతో సదరు కాంట్రాక్టర్ గుడిని మరో చోట నిర్మించడానికి గ్రామస్తులతో మాట్లాడినట్లు తెలిసింది. గుడిని త్వరలోనే తొలగించి అదే గ్రామంలో మరో చోట నిర్మించే అవకాశం ఉంది.

నష్ట పరిహారం ఇవ్వాలి



రహదారి విస్తరణ పనుల్లో కిరాణం తొలగించాల్సి వచ్చింది. దీని మూలంగా వ్యాపారానికి అనుకూలంగా లేకుండా పోయింది. ప్రస్తుతం వ్యాపారం సాగడం లేదు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇవ్వాలి.

– ధనిశెట్టి ఆంజనేయులు, గుమ్మడి దొడ్డి

కొంత సడలించాలి



నాలుగు లైన్ల రహదారి పనుల్లో భాగంగా విస్తరణ పనులను చేపట్టరు. గ్రామాల్లో 100 అడుగుల మేర సేకరణ చేస్తుండటంతో భారీగా నష్టపోతున్నాము. కొంత మేర సడలించి విస్తరణను తగ్గించాలి.

– కాకర్లపూడి సత్యనారాయణ, చెరుకూరు

ప్రభుత్వాలు ఆదుకోవాలి



జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఇళ్లు, దు కాణాలు కోల్పోతున్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలు ఆదుకోవాలి. ఏజెన్సీలో ఎక్కువగా పేద, బడుగు, బల హీన వర్గాల ప్రజలే ఉన్నారు. వారి పరిస్థితిని అర్థం చేసుకోని సాయం అందించాలి.

– కారం నాగేశ్వరరావు, గుమ్మడిదొడ్డి

మల్లంపల్లిలో వైద్యశిబిరం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లిలో జంపన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పలు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ భూక్య జంపన్న మాట్లాడుతూ.. మల్లంపల్లి పరిసర ప్రాంతాల నుంచి సుమారు 320 మంది ఉచిత కంటి పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. దీంతో పాటు ధీర్ఘకాలిక వ్యాధులు వారు హాజరు కాగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందించామని అన్నారు. 40 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమవగా వారిని ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలించి శంకర్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయిస్తామని అన్నారు. శిబిరంలో డాక్టర్ ప్రణయ్, వైద్య బృందం పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ వేడుకలు


ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఎగురవేస్తున్న రాకేశ్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉపాధ్యక్షుడు సాదు రాకేశ్ ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల సమస్యలు, హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ అంటేనే పోరాడే తత్వమని కేంద్రంలోను రాష్ట్రంలోను యూనివర్సిటీలలోను ఎలక్షన్ల సమయంలో కూడా ఎస్‌ఎఫ్‌ఐ గెలుస్తూ వస్తుందన్నారు. పోరాటం నినాదంతో స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే లక్ష్యంతో ముందుకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి జాగటి రవితేజ, మండల అధ్యక్ష కార్యదర్శులు ముక్కెర ధనుశ్, బట్ట స్వామి, సోడి అశోక్, కుమ్మరి నర్సింగరావు విద్యార్థి బృందం పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యక్తులతో సర్వే?

మంగపేట: మండలంలోని కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నట్లు విస్వసనీయ సమాచారం. అంతే కాకుండా కొందరు పంచాయతీ కార్యదర్శులు, కారోబర్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం వివరాల కోసం వెళ్లి వివరాలు సేకరించడంతో పాటు ఇంటిపేరు రిజిస్ట్రేషన్ పేరుతో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు వారి సొంత పనులకు పరిమితమై వారికి బదులుగా ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. అంతే కాకుండా కొందరు పంచాయతీ కార్యదర్శులు, కారోబర్‌లు సర్వేకోసం వెళ్లి ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఇప్పటి వరకు మీఇంటి పన్ను బకాయి కట్టాలని బలవంతం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే ఇంట్లో నివసించే రెండు కుటుంబాల వారికి మీ ఇంటి నంబర్ మీ పేరుమీద లేదని, మీ పేరుతో రిజిస్ట్రేషన్ చేస్తేనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతుందని చెపుతూ అందుకు ఖర్చు అవుతుందని చెప్పి డబ్బులు వసూలు చేస్తు ఈ విషయాన్ని బయటకు చెప్పొద్దని గుట్టుగా చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు విస్వసనీయ సమాచారం. విషయంపై ఎంపీడీఓ భద్రును వివరణ అడుగగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. ప్రైవేట్ వ్యక్తులతో సర్వే చేయించినా, రిజిస్ట్రేషన్ పేరుతో డబ్బులు వసూలు చేసిన చర్యలు తీసుకుంటామన్నారు.

గుంతలమయంగా అంతర్గత రోడ్డు


రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మల్హర్: మండలంలోని చిన్నతూండ్ల -పెద్దతూండ్ల గ్రామాన్ని కలుపుతూ ఏర్పాటు చేసిన అంతర్గత రోడ్డు గుంతలమయంగా మారింది. రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా పెద్దతూండ్ల, తాడిచర్ల వైపు నిత్యం రవాణా సాగుతుంది. అలాగే పొలం పనులకు రైతులు నిత్యం వెళ్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.